క్లుప్తంగా

తూర పునరుద్ధరణ కోసం ధర్నా



నగరంలో ధర్నా చేస్తున్న రైతులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని చాకలి చెరువు ప్రాంతంలో రోడ్డు మధ్యలో ఉన్న మురుగునీటి తూర దెబ్బతినడం వల్ల తమ పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పాడైన తూరను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైతులు మంగళవారం ధర్నా చేశారు. తూర మూసుకుపోవడం వల్ల సుమారు 50 ఎకరాల పొలాలు ముంపు బారిన పడుతున్నాయని చెప్పారు. నారుమడులు నీట మునగడంతో, నాట్లు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. అధికారులు తక్షణం స్పందించి తూర పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు వానరాశి త్రిమూర్తులు, రాయుడు ఆనందరావు, కోన నర్సింహారావు, ఇలియాస్ అలీ, బొంతు సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు: పంచాయతీలకు సంబంధించిన ఆర్థిక సంఘం నిధులతో మారుమూల ప్రాంతాలకు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని సర్పంచ్ అడబాల తాతకాపు అన్నారు. లూటుకుర్రు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో అడబాల వారి మెరక, బాడిలంక కాలనీలో నూతనంగా నిర్మించనున్న రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బోనం అబ్బులు, పాలూరి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

మామిడికుదురు: పాశర్లపూడిలంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు స్టూడెంట్ కిట్లను అందజేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యాగ్‌లు, యూనిఫారం, షూలు, సాక్స్‌లు, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.శ్రీరామకృష్ణ, ఎంపీటీసీ చెరుకుపరి పార్వతి, పాఠశాల స్థల దాత బొరుసు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, కోలా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు..

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బాలికల ఇంటర్మీడియెట్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం పుస్తకాలను పంపిణీ చేసినట్టు ఎంఈఓ-1, 2 కాంగ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ 16, బైపీసీ 7, సెంకడియర్ ఎంపీసీ 9, బైపీసీ 14 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, నోట్ పుస్తకాలను అందించామన్నారు.

వ్యక్తికి పాము కాటు

సఖినేటిపల్లి: ముంపు గ్రామమైన అప్పనరామునిలంకకు చెందిన దొంగ పవన్‌సాయి మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. పశువుల మేతం కోసం పచ్చిగడ్డి కోస్తున్న సమయంలో పాము అతడిని కాటేసింది. అతడిని గమనించిన స్థానికులు హుటాహుటిన టేకిశెట్టిపాలెం వద్ద ఉన్న వైద్య శిబిరానికి తరలించారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా కావ్య పర్యవేక్షణలో సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యానికి 108లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భోజన పథకం ప్రారంభం

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల బృందం ఈ పథకాన్ని నిర్వహించింది. అనేక మంది దాతలు తమ వంతు సహకారంగా మిఠాయిలను అందజేశారు. సంధిపూడిలో సర్పంచ్ తోట భవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషి ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఈ పథకాన్ని ప్రారంభించారు.

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆలమూరు: వరద ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బడుగువానిలంకతో పాటు, పంటలు తీవ్రంగా దెబ్బతిన్న చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానిక రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఉద్యానవన పంటలైన బొప్పాయి, జామ, కూరగాయలు, పూల తోటలు, అరటి పంటలకు భారీ నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే వద్ద బాధిత రైతులు వాపోయారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


అయినవిల్లి: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలగాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై వి.రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆయన వివిధ కళాశాలల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అశ్లీల ప్రదర్శనలు, మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదన్నారు. అలాగే చట్టాలపై పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. త్వరలోనే విద్యార్థులకు కళాశాలల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.



అయినవిల్లిలంకలో ముంపులో ఉన్న అరటి తోట



అయినవిల్లిలంకలో నీట మునిగిన ఇటుక బట్టీలు



సఖినేటిపల్లి లాకుపేటలో ఇంటింటికీ సొంత వేట బోటు



సఖినేటిపల్లి లాకుపేటలో ముంపులో ఉన్న దాబా

కనుచూపు మేర.. కన్నీటి వరద



సఖినేటిపల్లి లాకుపేటలో వరదలో దెబ్బతిన్న పూరిల్లు

- ముంపులోనే లంక గ్రామాలు
- నీట మునిగిన జనావాసాలు, పంటలు
- పడవలపైనే ప్రయాణిస్తున్న గ్రామస్తులు
- బాధితులకు మంచినీరు, ఆహార ప్యాకెట్ల పంపిణీ
- సహాయక చర్యలపై బాధితుల అసంతృప్తి

గోదారమ్మ ఉగ్రరూపానికి పల్లెజనం విలవిల్లాడుతున్నారు వరద ఉధృతికి పల్లె, పంటా ఏరులయ్యాయి. ఎటు చూసినా జల ప్రళయమే కనుల ముందు కదలాడుతోంది. జనావాసాలను వరద ముంచెత్తడంతో, ఇళ్ల నుంచి బయటకు అడుగు వేయలేని పరిస్థితి ఎదురైంది. బాధితులు రాకపోకలు సాగించేందుకు పడవలే దిక్కయ్యాయి. రోజుల తరబడి ముంపులోనే జనం కాలం వెళ్లదీస్తున్నారు. అధికార యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యలపై బాధితులు అసహనంతో పెదవి విరుస్తున్నారు.



అప్పనరామునిలంకలో పడవపై ప్రయాణిస్తున్న బాధితులు

సఖినేటిపల్లి: దాదాపు రెండు వారాలుగా మండలంలో కొనసాగుతున్న వరద ఉధృతితో లంక గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. మంగళవారం కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి తగ్గినా, దిగువకు వస్తున్న భారీ వరద ప్రవాహం టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి లాకుపేట ప్రజలను కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. సఖినేటిపల్లి రేవు వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. అప్పనరామునిలంకలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి పడవలపై గ్రామస్తులు అప్పనరామునిలంకకు రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద ఉధృతి కొనసాగుతోంది. సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి పడవలపై వారు లాకుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. టేకిశెట్టిపాలెం అగ్నికుల క్షత్రియ కాలనీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. ఆయా ముంపు గ్రామాల్లో బాధితులకు పడవలపై టిన్ల ద్వారా తాగునీటిని, భోజన ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. టేకిశెట్టిపాలెం వద్ద నుంచి అప్పనరామునిలంకకు ఏఓ పీవీ నరసింహారావు, పలువురు వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సఖినేటిపల్లి లాకుపేటలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ అనూష, వీఆర్వోలు శ్రీనివాస్, నాగరాజు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఈశ్వర్ సేవలందిస్తున్నారు.

ముంపు బారిన కాలనీలు

అంబాజీపేట: గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో వాకలగరువు, తొండవరం, నందంపూడి వాసులు ఆందోళనకు గురవుతున్నారు. వైనతేయి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం గోదావరి స్థాయి మించి ప్రవహించడంతో గ్రామాల్లో ఉన్న కౌశికలకు వరద నీరు చేరింది. దీంతో కాలనీల్లోకి, కొబ్బరి, అరటి తోటల్లోకి నీరు ప్రవేశించింది. వాకలగరువు, తొండవరం గ్రామాల్లోని గోదావరి ఒడ్డున ఉన్న అరటి, దొండ, బీర, కొబ్బరి పంటలు ముంపు బారిన పడ్డాయి. తొండవరం రజకలపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో రాకపోకలు స్తంభించాయి. నందంపూడిలో కౌశిక పొంగి పొర్లడంతో బొంతువారిపేట, కొబ్బరి, అరటి తోటలు నీట మునిగాయి. అలాగే తొండవరం హైస్కూల్ కాలనీలోకి, నవుండ్రువారిపేటలో 45 ఇళ్లు ముంపునకు గురయ్యాయి.

ఆహార పొట్లాల పంపిణీ

వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు మంగళవారం పలువురు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. నందంపూడి శివారు బొంతువారిపేట, తొండవరం నవుండ్రువారిపేట, హైస్కూల్ కాలనీ, వాకలగరువు రజకపేట కాలనీల్లో నీట మునిగిన ఇళ్లను వారు పరిశీలించారు. అనంతరం 200 మందికి ఆహార పొట్లాలను అందజేశారు. సర్పంచ్‌లు మద్దింశెట్టి దొరబాబు, పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రమంగా వరద తగ్గుముఖం

అయినవిల్లి: వరద క్రమేపి తగ్గుముఖం పడుతోంది. వరదతో మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, మడుపల్లిలంక, చింతనలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల ప్రజలు ముంపుతో ఇబ్బందులు పడుతున్నారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే నీట మునగడంతో, ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ పడవలపై ప్రయాణానికి అధికారులు అనుమతించారు. లైఫ్ జాకెట్లు విధిగా ధరించాలని నిబంధన విధించారు. వీరవల్లిపాలెంలో ఒకటి, ముక్తేశ్వరం కాజ్‌వే ఆరు, పొట్టిలంకలో ఒకటి, కొండుకుదురులో ఒక పడవను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.



వరదలోనే ఉన్న అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లి లంక కాజ్‌వే

వరద శాంతించినా.. తగ్గని ముంపు

మామిడికుదురు: గోదావరి వరద శాంతించినా మామిడికుదురు మండలంలోని మూడు గ్రామాలను ఇంకా ముంపు వీడలేదు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై మూడు అడుగుల మేర వరద పొంగి ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ధైర్యం చేసి బైకులపై వరదలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మరికొందరు ట్రాక్టరుపై వరద ప్రవాహంలో ప్రయాణిస్తున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి కాజ్‌వేపై నాలుగు అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. పాశర్లపూడి, పాశర్లపూడి లంక మత్స్యకార ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ముంపు తగ్గడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాఉండగా పెదపట్నంలోని రత్నాపురం, అరుంధతీపేటల్లో వరద ప్రవాహం కాస్తంత తగ్గింది.



అప్పనపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద



ముంపులోనే ఉన్న అప్పనపల్లిలోని మొల్లేటివారిపాలెం



సఖినేటిపల్లి ఏటిగట్టు వద్ద లాకుపేటకు వెళ్లడానికి పడవల వద్ద వేచి ఉన్న స్థానికులు



తొండవరంలో ముంపునకు గురైన నవుండ్రువారిపేట



తొండవరం హైస్కూల్ కాలనీలోకి చేరిన వరద



సఖినేటిపల్లి లాకుపేటలో బాధితులకు భోజన ప్యాకెట్లు ఇస్తున్న సిబ్బంది



అప్పనపల్లి నుంచి ట్రాక్టరుపై రాకపోకలు సాగిస్తున్న ముంపు బాధితులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మండల ప్రజా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే బండారు



అధికారుల తీరుపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

ఆలమూరు: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనుల్లో పురోగతి ఉండేలా వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న నాడు-నేడు, జల్‌జీవన్ మిషన్, ఎన్ఆర్ఈజీఎస్ తదితర పనుల నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో పంచాయతీలు శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ, సచివాలయ, ఆర్‌బీకే తదితర భవన నిర్మాణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పట్టించుకోలేదని సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, సంగిత సుభాష్ తదితరులు చెప్పారు. మండలానికి మంజూరైన రూ.2.52 కోట్ల నిధులను కొన్ని గ్రామాలకు కేటాయించలేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్ల విషయాన్ని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జొన్నాడ-మండపేట, కొత్తూరు-వెదురుమూడి ప్రధాన రహదారుల్లో ఏర్పడిన ప్రమాదకర గోతులను వెంటనే పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, వెటర్నరీ ఏడీ ఎల్.అనిత, సీడీపీఓ పి.శారద తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో విజ్ఞాన సముపార్జన

అంబాజీపేట: ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగాన్ని పెంచి విజ్ఞానాన్ని సముపార్జించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. జి.అగ్రహారం ఉన్నత పాఠశాలను సీఎంఓ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యంతో కలసి మంగళవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రణాళికతో కష్టపడి ప్రతి సబ్జెక్టును ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం ట్యాబ్‌లను, విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న డీఈఓ

కనీసం విత్తనాలైనా ఇవ్వండి

వ్యవసాయ అధికారులకు రైతుల గోడు

ఆలమూరు: భారీ వర్షాలకు మండలంలోని పినపళ్లలో పంట భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికితోడు స్థానిక పేపరు మిల్లులోంచి వెలువడిన వ్యర్థాల వల్ల వరినాట్లు రంగు మారి వాడిపోయాయి. ఇప్పటికే స్థానిక పేపరు మిల్లు యాజమాన్యం నష్టపోయిన 52 ఎకరాలకు కొంత పరిహారం అందించేందుకు ముందుకొచ్చినా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆయా పంట భూములు మండపేట రెవెన్యూ పరిధిలో ఉండగా, రైతులు మాత్రం గ్రామానికి చెందిన వారు. దెబ్బతిన్న పంట మళ్లీ సాగు చేసుకోవలసిన పరిస్థితి ఉత్పన్నమైనందున, సత్వరమే మండపేట వ్యవసాయ అధికారులు సత్వరం స్పందించి కనీసం విత్తనాలైనా రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

రాయితీకి కృషి చేస్తా

పినపళ్లలో దెబ్బతిన్న వరి పొలాల్లో సాగు చేపట్టే అవకాశం ఉంటే సంబంధిత రైతులకు స్వల్ప కాలంలో పంట చేతికొచ్చే వంగడాల విత్తనాలను రాయితీపై అందించేందుకు కృషి చేస్తానని ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు అన్నారు. ఇప్పటికే దెబ్బతిన్న పంటపై అంచనా వేసి, వివరాలను అందజేయాలని మండపేటకు చెందిన అధికారులను ఆదేశాలిచ్చామన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత



మృతుని కుటుంబానికి చెక్కును అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: ఊడిమూడిలంక వద్ద ఈ నెల 28న జరిగిన పడవ ప్రమాదంలో చదలవాడ విజయకృష్ణ (27) మృతి చెందగా, అతని కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఊడిమూడి శివారు పెదపేటలో మృతుడి తల్లిదండ్రులు పార్వతి, పెదవెంకయ్య, సోదరి కల్యాణిని వారు పరామర్శించారు. మృతుడి సోదరికి నెల రోజుల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, పలువురు నాయకులు ఉన్నారు.

పశువులకు దాణా పంపిణీ

పి.గన్నవరం: మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో 3,500 పశువులకు 51 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను ప్రభుత్వం సరఫరా చేసిందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి తెలిపారు. మంగళవారం జి.పెదపూడి, ఊడిమూడిలంక గ్రామాలకు చెందిన పాడి రైతులకు దాణా బస్తాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి కిరణ్ చైతన్య, సర్పంచ్ దంగేటి సత్యనారాయణ, ఎంపీటీసీ పల్లి మోషే తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు మంగళవారం పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన గుబ్బల రాజేష్, కరుణ దంపతులు దాణాను వితరణ చేశారు. మొత్తం 50 కేజీల చొప్పున ఐదు బస్తాలను అందజేశారు.

భయం గుప్పిట లంక గ్రామాలు

పి.గన్నవరం: కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ధవళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికీ, భద్రాచలం వద్ద మళ్లీ స్వల్పంగా వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే పది రోజులుగా లంక గ్రామాల ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, మానేపల్లి శివారు శివాయలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతోంది. కె.ఏనుగుపల్లి రహదారిపై ఇంకా వరదనీరు ప్రవహిస్తోంది. వరద ముంపు ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పర్యటించారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఊడిమూడిలంక వద్ద వరద బాధితులకు మంచి నీటి ప్యాకెట్ల బస్తాలు తరలిస్తుండగా జరిగిన పడవ ప్రమాదంలో చదలవాడ విజయకృష్ణ మృతి చెందిన నేపథ్యంలో, అతడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన వరదలకు మానేపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు మృతిచెందగా, వారి కుటుంబాలకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 లక్షల వంతున తక్షణ ఎక్స్‌గ్రేషియా అందించిందని గుర్తు చేశారు. అయితే విజయకృష్ణ కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు మాత్రమే ఇవ్వడం సమంజసంగా లేదన్నారు. అలాగే అయినవిల్లిలంకలో ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఓ వ్యక్తి మరణించగా, అతడి కుటుంబానికి కూడా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని చిట్టిబాబు డిమాండ్ చేసారు.



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బురదను తొలగిస్తున్న సిబ్బంది

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

రావులపాలెం: ఉపాధ్యాయుల్లో మార్గదర్శకత్వ ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన శిక్షణ మంగళవారం ముగిసింది. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ మంగళవారం సాయంత్రం వరకూ కొనసాగింది. ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 పి.శ్రీనివాసరాజు సూచించారు. ముగింపు సమావేశంలో ఆయనతో పాటు, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కో-ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 53 పాఠశాలలను మెంటారింగ్ స్కూళ్లుగా గుర్తించారన్నారు. ఆయా పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ మెంటారింగ్‌ను చేపట్టినట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా టీచ్ టూల్ ట్రెనింగ్ పొందిన 42 మంది సర్టిఫైడ్ అబ్జర్వర్లను టీచర్ మెంటార్స్‌గా ఎంపిక చేసి, వారికి రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారన్నారు. తద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను మెరుగుపర్చేందుకు సాయపడుతుందని రాంబాబు తెలిపారు. విజయవాడ నుంచి వచ్చిన ఎల్ఎఫ్ఈ టీమ్ సభ్యులు క్రాంతికుమార్, షామి, కిషన్ శిక్షణ ఇచ్చారు.

పశు పోషణకు ప్రభుత్వ ప్రోత్సాహం

కొత్తపేట: ప్రభుత్వం పశు పోషణకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి (డీఏహెచ్ఓ) డాక్టర్ కె.వెంకట్రావు వెల్లడించారు. ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా వారు వానపల్లి శివారు సత్తెమ్మలంక గ్రామంలో పర్యటించారు. వరద పరిస్థితులపై స్థానికులతో మాట్లాడిన ఎమ్మెల్యే, సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సందర్శించి, పశువుల దాణా పంపిణీ చేశారు. ఏహెచ్ ఏడీ డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ, సర్పంచ్ పల్లి భీమారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దర్శాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.